





పీఆర్ఎల్ఐలో భాగంగా వనపర్తి జిల్లాలో నిర్మించిన ఏదుల రిజర్వాయర్

అంచనాలు లాంచనాలు

ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్నది. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి రైతుల పరిస్థితిని పరిపుష్టం చేయడానికి ఏ ప్రభుత్వం వచ్చినా సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యంగా చేపడుతోంది. ప్రాజెక్టులను ప్రారంభించేటప్పుడు ఉండే ఉత్సాహం పూర్తి చేయడంలో ఉండటం లేదు. అంచనాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో పనులు దశాబ్దాల పాటు సాగుతూనే ఉన్నాయి. అంచనా వ్యయాలు అమాంతం రెండు, మూడు రెట్లు పెరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వాలు మళ్లీ అంచనాలు మార్చడం లాంచనమవుతోంది. దీంతో నీరు పారకుండానే నిధులు ఆవిరవుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టిన ప్రతీ ప్రాజెక్టు పరిస్థితి ఈ విధంగానే ఉన్నది. ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తయ్యేనో... వ్యవసాయ భూములకు ఎప్పుడు నీరందేనో అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పూర్తికాని సాగునీటి ప్రాజెక్టులపై నేటి నుంచి 'ఆంధ్రజ్యోతి' కథనాలు..

- సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రభుత్వ తీరుతో బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం
- ప్రారంభ అంచనాల కంటే రెండు నుంచి మూడింతలు పెరుగుతున్న వ్యయం
- పీఆర్ఎల్ఐ రూ.32 వేల కోట్ల ప్రారంభ అంచనా.. ప్రస్తుతం రూ.55 వేల కోట్లు
- నెట్టెంపాడు రూ.1,428 కోట్లు.. 2022లోనే రూ.2,752 కోట్లకు పెంపు, అయినా పూర్తి కాని ప్రాజెక్టు
- కల్వకుర్తి ప్రారంభ అంచనా రూ.2,100 కోట్లు.. ఇప్పుడు రూ. 5,860 కోట్లకు పైగానే..
- రాజీవ్ భీమా, తుమ్మిళ్ల, గట్టు లిఫ్ట్, కోయిల్‌సాగర్ అంచనాలు కూడా ఇదేతంతు

ప్రాజెక్టులు పరిహారం -1

మహబూబ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పాలమూరు కరువును తీర్చడం కోసం పలు ప్రభుత్వాల హయాంలో సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ద శాబ్దాలు గడుస్తున్నా అవి పెండింగ్ ప్రాజెక్టులుగానే ద ర్శనమిస్తున్నాయి. తప్పా పూర్తి స్థాయిలో పనులు మా త్రం కావడం లేదు. ఆయా ప్రభుత్వాలు పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని చెప్పుకుంటున్నాయి. వాస్తవ పరిస్థితిని గమనిస్తే ప్రాజెక్టులు సమయానికి పూర్తికాకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం వాటి నిర్మాణాల పూర్తికి భారీ మొత్తంలో ప్రజల సొమ్మును ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రారంభ అంచనాలతో పోల్చినప్పుడు ఆ వ్యయం రెండు నుంచి మూడింతలు పెరుగుతుండటం విస్మయం కలిగిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం కాంట్రాక్టర్లు అనుకున్న వే గంతో పనులు చేయకపోవడంతో ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) పెరుగుతూ పోతున్నాయి. ప్రభుత్వాలు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం, అధికారుల ఉదాసీన వైఖరి కూడా ఇందుకు కారణమవుతున్నాయని చెప్పవచ్చు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో

(మిగతా 6లో..)



కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్మించిన కొల్లాపూర్ పంప్‌హౌస్

ఇరుకు గదిలో.. ఇక్కట్లు

- ఒకే గదిలో నారాయణపేట బాల కేంద్రం
- ఆ గదిలోనే పలు కళల్లో విద్యార్థులకు శిక్షణ
- ఇక్కడ శిక్షణ పొందిన వారికి జాతీయ స్థాయిలో అవార్డులు
- బాల భవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలంటున్న కళాకారులు

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని బాల కేంద్రం ఇరుకు భవనంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఒకే గదిలో పలు రకాల కళలపై శిక్షణ ఇవ్వాల్సి వస్తోంది. దాంతో కేంద్రాన్ని బాల భవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కళాకారులు కోరుతున్నారు. నాలుగు దశబ్దాల క్రితం 1987లో నారాయణపేటలో ప్రముఖ కళాకారులు రత్నగర్భ, సుబ్బయ్య, సరాఫ్ కృష్ణ, గాంజాయి నారాయణ, సంగ నర్సిములు, రాంచందర్‌రావు జెగిరికల్ ప్రోత్సాహంతో దివంగత ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి ఆధ్వర్యంలో బాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని సెంటర్ చౌక్ బజార్‌లో అద్దె భవనంలో ఏడు మంది విద్యార్థులతో కేంద్రాన్ని నిర్వహించారు. నాటి నుంచి నేటి వరకు సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు ఐదు నుంచి 16 ఏళ్ల వయస్సున్న విద్యార్థులకు వివిధ కళల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థుల్లో చాలా మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చారు. బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని అయితే 37 ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నా ప్రయోజనం ఉండటం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.

బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

బాల కేంద్రానికి విశాలమైన సొంత భవనాన్ని నిర్మించి, బాల భవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి. సంగీత, వాయిద్య పరికరాలు అందించేందుకు దాతలు, అధికారులు ముందుకు రావాలి. విద్యార్థులను కళాత్మకంగా తీర్చిదిద్దేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తాం.

- మహిపాల్ రెడ్డి, బాలకేంద్రం సూపరింటెండెంట్, నారాయణపేట

నారాయణపేటలోని బాలకేంద్రం

అడ్మిషన్లు ఇలా..

బాల కేంద్రంలో చేరేందుకు ఏడాదికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.20, ఇతరులు రూ.50 అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 6-16 ఏళ్ల వయస్సున్న బాల బాలికలకు శిక్షణ ఇస్తారు.

శిక్షణ ఇచ్చే అంశాలు..

శాస్త్రీయ నృత్యం, గాత్రం, సితార్, తబల, చిత్రలేఖనం, అధునాతన వాయిద్యాలైన రిథమ్ ప్యాడ్, డ్రమ్స్, కీ బోర్డులపై నిష్ణాతులతో శిక్షణ ఇప్పిస్తున్నారు.

అవార్డులు అందుకున్న విద్యార్థులు

బాల కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులు పలు అవార్డులు అందుకున్నారు. సీతార్ వాయిద్యంలో వాసుదేవ ఆచార్య, సువర్ణ, శ్రావణి జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. పలు కళల్లో మరికొందరు విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు పొందారు.

అన్ని శిక్షణలు ఒకే గదిలో..

బాలకేంద్రం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఒక ఇరుకైన గదిలో కొనసాగుతోంది. రోజూ 40 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఈ కేంద్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ కుమారుడు సారంగ్ డ్రమ్స్, రిథమ్ ప్యాడ్(సంగీతం)లో శిక్షణ పొందుతుండటం విశేషం. ఒక్క గదిలోనే వివిధ రకాల కళలపై శిక్షణ ఇవ్వాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి అంటున్నారు. సంగీతం పరికరాలు అరకొరగా ఉన్నాయని, బాత్‌రూమ్‌లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చెబుతున్నారు.



శిక్షణ ముగింపులో సితార్ వాయిస్తున్న విద్యార్థినులు(ఫైల్)

సదాశయం ఔషధ వనం

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బొటానికల్ గార్డెన్

ప్రొఫెసర్ సదాశివయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు

ఔషధ, అరుదైన మొక్కల పెంపకం

7

రూ. 2 కోట్ల విలువైన మాదకద్రవ్యాల దహనం

ఉమ్మడి జిల్లాలో ఏడాది కాలంలో పట్టివేత

కాల్చేసిన డ్రగ్ డిస్పోజల్ కమిటీ

6



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

రూ.40 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం

- పాలమూరులో ఒక్కో వార్డుకు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల కేటాయింపు
- పార్టీలకు అతీతంగా నిధులు ఇవ్వడంతో సభ్యుల హర్షం

మహబూబ్‌నగర్ మునిసిపల్ కౌన్సిల్ ఒకే రోజు రూ.40 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. అధిక మొత్తంలో నిధులు కేటాయించడంతో కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా హర్షం వ్యక్తం చేశారు. గతంలో రూ.10 లక్షలకే ఎదురు చూడాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒక్కో వార్డుకు రూ.60 లక్షల వరకు నిధులు కేటాయించడం శుభసూచకమని అన్నారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. వెంటనే టెండర్లు పిలిచి, పనులు చేపట్టేలా చూడాలని కోరారు. నిధుల కేటాయింపుతో వార్డుల్లో ధైర్యంగా తిరుగగలుగుతామని కౌన్సిలర్లు చెప్పారు.

- మహబూబ్‌నగర్

6

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పొరపాట్లు ఉండొద్దు

పూర్తి పారదర్శకంగా చేపట్టాలి

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి



సర్వే అంశాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. ఈ సర్వే ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నందున సర్వేలో పూర్తి పాదర్శకత పాటించాలని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాత పాలమూరులో జరుగుతున్న సర్వేను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి, వారితో మాట్లాడారు. సొంత స్థలం కలిగి ఉన్నారా?, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు?, పెంకుటిల్లా.. పక్కా గృహమా? ఇంటి స్థలానికి సంబంధించిన స్థలం ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా? అని అడిగి అధికారులతో వివరాలు నమోదు చేయించారు. అనంతరం సర్వే అధికారులతో మాట్లాడుతూ సర్వే చేస్తున్న సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని అడిగారు. ఇప్పటివరకు ఎంత మంది వివరాలు సేకరించారు?, ఒక ఇంటి వివరాలు నమోదు చేయడానికి ఎంత సమయం పడుతుంది?, ఎంతమంది వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు? వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అర్హత కలిగిన వారికి అన్యాయం జరుగకుండా, లబ్ధి చేకూరేందుకు అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డీఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థులను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో సౌకర్యాలు ఉంటాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశపడి పంపిస్తారని, కానీ అక్కడ ప్రభుత్వ పాఠశాలల కంటే మంచి సౌకర్యాలు ఉండవన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించే అనుభవం, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు నిరుపేద తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను పంపిస్తారని, ఉపాధ్యాయులే బాధ్యత తీసుకొని సమాజానికి జాతిరత్నాలను అందించాలని అన్నారు. సైన్స్ ప్రయోగాల కోసం నిధులు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే జ్ఞాపికలు, సర్టిఫికెట్స్ అందించారు.

అద్భుతంగా ఉన్నాయి: కలెక్టర్

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. చిన్న పిల్లల్లో ఆలోచనలు ఎక్కువగా ఉంటాయని, వాటిని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీఈవో ప్రవీణ్‌కుమార్, సీఎంవో బైకాని బాలు యాదవ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, శంభుప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి కథనంతో వసతులు

మొక్కుబడిగా జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. విద్యార్థులు కూర్చొని తినేందుకు నీడ కోసం టెంట్ ఏర్పాటు చేశారు.

క్లిక్.. క్లిక్..

కవర్లతో బెదుర్లు





వనపర్తి జిల్లా కేంద్రం నుంచి చిట్యాలకు వెళ్లే దారి మధ్యలో తుకం మడికి రక్షణగా ఓ రైతు చుట్టూ చీరలు, మధ్యలో ప్లాస్టిక్ కవర్లను కట్టాడు. తుకాన్ని పక్షులు తొక్కకుండా, పశువులు మేయకుండా వాటిని కట్టానని చెప్పాడు. ప్లాస్టిక్ కవర్లు గాలికి ఊగుతూ, శబ్దం చేయడంతో పక్షులు రావడం లేదని తెలిపాడు. అటుగా వెళ్తున్న వారు దీనిని చూసి ఐడియా అదిరింది! అని అనుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

ఆహార భద్రతపై దృష్టి పెట్టాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

మక్తల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆహార భద్రతపై అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని గుడిగండ్ల, జక్లేర్ పాఠశాలలను, మక్తల్ పట్టణంలోని గురుకుల పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. గుడిగండ్ల పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసిన కమిషనర్ ఇంకా మెరుగ్గా వండాలని చెప్పారు. గుడ్లు ఉడికించిన అరగంటలో అందించాలన్నారు. జక్లేర్ పాఠశాల వంట గదిని తనిఖీ చేసి, వంటకు పామాయిల్‌కు బదులు నాణ్యమైన నూనె వాడాలన్నారు. పప్పులో పోపు లేకపోవడంపై కమిషన్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. భోజనం నాణ్యత విషయంలో అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. భోజనం బాగో లేకుంటే కాగితంపై రాసి, ఫిర్యాదు పెట్టెలో వేయాలన్నారు. అనంతరం మక్తల్ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. సరుకుల నిల్వ, స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. శక్రవారం గుడ్డు ఇవ్వాల్సి ఉన్నా ఎందుకు ఇవ్వలేదన్నారు. ఎల్లమ్మకుంటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, గంజ్ రోడ్‌లోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు.



జక్లేర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు

ఘాటెక్కిన ఉల్లి..

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఫలితంగా కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. గత ఏడాది డిసెంబరులో కూడా ఉల్లి సాధారణ ధరలకే లభించిన ఉల్లిగడ్డ ధరలు మార్కెట్‌లో రోజు రోజుకు పెరుగుతున్నాయి. రెండు నెలల క్రితం కిలో 20 నుంచి 30 రూపాయలు ఉన్న ఉల్లిగడ్డల ధర ఇప్పుడు ఏకంగా 50 నుంచి 60 రూపాయలకు చేరుకుంది. నాణ్యతను బట్టి హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో 40 నుంచి 50 రూపాయలకు అమ్ముతుండగా రిటైల్ వ్యాపారులు కిలో 50 నుంచి 60 రూపాయలకు అమ్ముతున్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఉల్లిగడ్డ కొనాలంటేనే భయపడుతున్నారు. ఉల్లిగడ్డ లేనిదే రుచించని కూరలు పెరిగిన ధరలతో కొనేదేలా అని వాపోతున్నారు.

● అధిక వర్షాలే ప్రధాన కారణం

ముఖ్యంగా జిల్లాకు దిగుమతి చేసుకునే కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ ఏడాది రెండు నెలల క్రితం కురిసిన అధిక వర్షాలే కారణమని వ్యాపారులు అంటున్నారు. అంతే కాకుండా స్థానికంగా రైతుల నుంచి సరఫరా తగ్గిపోవడంతో వ్యాపారులు దూర ప్రాంతాల నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుని అమ్ముతున్నారు. దీంతో దిగుమతి సుంకం కలుపుకొని, ట్రాన్స్‌పోర్టు చార్జీలను కలుపుకొని ఉల్లి ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నారు. గత ఏడాది రబీ సీజన్ పాత స్టాక్ అయిపోయిందని, కొత్త స్టాక్ మార్కెట్‌లోకి ఇంకా రాలేదని పేర్కొంటున్నారు. మరో పది రోజుల్లో ఉల్లి ధరలు సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

● పది రోజుల్లో తగ్గే అవకాశం ఉంది



మన ప్రాంతం నుంచి రైతులెవ్వరూ ఉల్లిని పండించి మార్కెట్‌కు తేవడం లేదు. దీంతో దూర ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ట్రాన్స్‌పోర్టు చార్జీలను కలిపి అమ్మాల్సి వస్తోంది. దీనికి తోడు ఈ సారి అధిక వార్షాల కారణంగా అక్కడ ఉల్లిగడ్డ దిగుబడి తగ్గింది. దీంతో ఉల్లి ధరలు కాస్త పెరిగాయి. మరో పది రోజల్లో ఉల్లి ధరలు తగ్గే అవకాశం ఉంది.

- శ్రీనివాస్, హోల్‌సేల్ వ్యాపారి, నాగర్‌కర్నూల్

ప్రజా పంపిణీ పక్కదారి

» కొందరు డీలర్లే సూత్రధారులుగా వ్యాపారం

» రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల నుంచి రూ.10, 12కు కొనుగోలు చేస్తున్న డీలర్లు



ఖిల్లాఘణపురంలోని దివ్య, నవ్య రైస్ మిల్లులో ఇటీవలే విక్రయించడానికి తీసుకువచ్చిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

వనపర్తి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత బియ్యం అక్రమార్కులకు వరంగా మారింది. జిల్లాలో కొందరు రేషన్ డీలర్లు బియ్యాన్ని అక్రమ పద్ధతిలో మళ్లించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి తోడు రైస్ మిల్లర్లు కూడా ఈ దందాలో ఆరితేరారు. రోజు వారీగా మిల్లర్లు డీలర్ల నుంచి దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి సేకరించి సన్న బియ్యంగా మార్చి విక్రయించే దందాను సాగిస్తున్నారు. ఫలితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయ్యే బియ్యం అక్రమార్కులకు కాసులను కురిపిస్తున్నాయి. ప్రభుత్వ సొమ్మును తమ అక్రమ సంపాదనకు మార్చుకుంటూ కోట్లల్లో కొల్లగొడుతున్నారు. ఈ దందాకు రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయ్ అధికారుల పాత్ర సహకారంగా మారింది.

● ప్రధానంగా డీలర్లే సూత్రధారులు

జిల్లాలో రేషన్ బియ్యం దందా వెనుక కొందరు డీలర్లే ప్రధాన సూత్రధారులుగా మారారు. రైస్ మిల్లర్లతో పాటు రేషన్ దందా చేసే వ్యాపారులతో చేతులు కలిపి ప్రతీ నెల లక్షల్లో అక్రమ సంపాదనను వెనకేసుకుంటున్నారు. ప్రభుత్వం ఒక కుటుంబంలోని తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని అందజేస్తుంది. ఇదే అదునుగా భావించిన కొందరు రేషన్ డీలర్లు దుకాణాల వద్ద లబ్ధిదారులతో తంబు వేయించుకొని బియ్యం తూకం చేసి అక్కడే వారి దగ్గర రూ.10, రూ.12ల చొప్పున కొనుగోలు చేసి వారికి నగదు వెంటనే ఇచ్చేస్తున్నారు. గతంలో కొన్ని నెలల పాటు సన్న బియ్యం పంపిణీ చేసిన ప్రభుత్వం ప్రస్తుతం చేయకపోవడంతో దొడ్డు బియ్యాన్ని ఎవరు కూడా తినడం లేదు.

కనీసం దుకాణాల దగ్గరికి వచ్చి బియ్యాన్ని కూడా తీసుకువెళ్లడం లేదు. ప్రతీ నెల ఒకటి నుంచి 20వ తేదీ వరకు దుకాణాల వద్ద తంబు వేసి డబ్బులు తెచ్చుకుంటున్నారు.

ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అక్కడే వ్యాపారులు దుకాణానికి సమీపంలో వాహనాలను నిలిపి దొడ్డు బియ్యాన్ని వాహనాలలో తరలిస్తున్నారు. ఈ తతంగమంతా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తుందని ఆరోపణలు ఉన్నాయి.

● మిల్లర్లే అక్రమార్కులు

రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో కొందరు మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని మర పట్టించి సన్న బియ్యంగా మార్చి విక్రయిస్తున్నారు. ఇలా రూ.కోట్లలో సాగుతున్న అక్రమ బియ్యం దందాలో కొందరు మిల్లర్లే అన్నీ తానై వ్యవహరిస్తూ నడుపుతున్నారు. మర పట్టించి సన్న బియ్యంగా మార్చి విక్రయిస్తున్నారు. వీటినే మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● అధికారులకు రూ. లక్షల్లో వాటాలు

రేషన్ బియ్యం అక్రమ దందాలో డీలర్ల నుంచి మిల్లర్ల వరకు ప్రతీ ఒక్క వ్యాపారి తమ మండలంతో పాటు జిల్లా అధికారి తన కనుసైగల్లో పెట్టుకుంటున్నారు. అధికారులకు పట్టుబడిన సమాచారం వచ్చినా అక్కడి నుంచి బయటపడేలా వారి నుంచి ముందస్తు సమాచారం వచ్చేలా ప్రతి నెల వేల రూపాయల నుంచి లక్షల్లో ముడుపులిస్తున్నారు. ఈ దందాను అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీస్ వ్యవస్థలు ప్రేక్షక పాత్రను వహిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ప్రతీ నెల వాటాలు ముట్టడమే అనే ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడో ఒకసారి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే గాని నామమాత్రంగా రికార్డుల్లో ఉండటానికి అడపాదడపా కేసులు చేస్తున్నారు.

● ఈ ఏడాది 36 కేసులు..

506 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఈ ఏడాది వనపర్తి జిల్లా వ్యాప్తంగా అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై 36, 6ఏ కేసులు నమోదయ్యాయి. వారి నుంచి 504 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 17 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పీడీఎఫ్ బియ్యంతో పాటు వాహనాల విలువ సుమారు రూ.31,37,790 ఉంటుందని సమాచారం. అయితే పీడీఎస్ దందాలో అధికారులు స్వయంగా దాడులు చేసి పట్టుకున్న దాఖలాలు ఎక్కడా లేవు. వ్యాపారులే ఒకరి మీద ఒకరు అధికారులకు సమాచారం ఇచ్చి పట్టిస్తున్నారు. అధికారుల కళ్లముందే డీలర్లతో పాటు రైస్ మిల్లు వ్యాపారులు పీడీఎస్ దందా నిర్వహిస్తున్న చర్యలు తీసుకోకపోవడంతో రేషన్ మాఫియా రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ అరికట్టాలంటే జిల్లా ఉన్నతాధికారులు రేషన్ దుకాణాల వద్ద కొనుగోలు చేస్తున్న డీలర్లతో పాటు రైస్ మిల్లులో దొడ్డు బియ్యాన్ని సన్న బియ్యంగా మర ఆడించి విక్రయిస్తున్న వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఖిల్లాఘణపురంలో స్వాధీనం చేసుకున్న బియ్యం(ఫైల్)

ఆన్‌లైన్‌లో యూనో యాప్ ద్వారా రూ.43వేల మాయం

● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మునిసిపల్ ఉద్యోగి

గద్వాల క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రాప్‌లోన్ ఆన్‌లైన్ ట్రాన్స్‌జెక్షన్ పేరుతో రూ. 43వేలు మాయమైనట్లు గద్వాల మునిసిపల్ ఉద్యోగి గట్టన్న శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాలకు సంబంధించిన మునిసిపల్ ఉద్యోగికి సంబంధించి గతంలో క్రాప్‌లోన్‌లో రుణం తీసుకోగా ఇందులో 23వేలు రుణమాఫీ రాగా ఇంకా 34 వేలు కట్టాల్సి ఉన్నదన్నారు. ఈ విషయంపై గురువారం బ్యాంక్ నుంచి సమాచారం రావడంతో ఫీల్డ్ ఆధికారితో మాట్లాడి రేపు పంపిస్తానని చెప్పి వచ్చానన్నారు. అయితే అలా మాట్లాడిన కొద్దిసేపటికే నడిగడ్డ ముదిరాజ్ బలగం గ్రూప్ నుంచి యూనో యాప్ ద్వారా కేవైసీ అప్‌డేట్ చేసుకోమని వచ్చింది. దీనిని పార్వార్డ్ చేసింది గోనుపాడుకు చెందిన ఓ వ్యక్తి. అయితే ఈ యూనో యాప్ బ్యాంకు నుంచి వచ్చిందేమోనని, బ్యాంకు ఫీల్డ్ అధికారి పంపాడేమోనని భావించి వెంటనే మునిసిపల్ ఉద్యోగి అందులో ఉన్న బ్లూటిక్స్‌పై ప్రెస్ చేయడంతో వెంటనే సెకన్‌లో ఒక ఓటీపీ వచ్చిందని, వెనువెంటనే తన ఖాతాలో ఉన్న రూ. 43వేలు మాయం అయ్యాయన్నారు. అయితే ఈ విషయంపై యాప్‌లో పార్వార్డ్ చేసిన గోనుపాడు గ్రామానికి చెందిన వ్యకిని అడుగగా నా నంబర్‌పై ఎవరు చేశారో తెలియదన్నారు. అంతేగాక రుణమాఫీ అయిన రూ. 23 వేలు కూడా ఇప్పుడు కాలేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే అయ్యాయని మునిసిపల్ ఉద్యోగి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా తాన డబ్బులు పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో, సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

పరిశోధన ఫలితాలు

వ్యవసాయ అభివృద్ధికి దోహదపడాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి



వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారెడ్డి, కలెక్టర్

బిజినేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో సాధించిన పరిశోధన ఫలితాలు వ్యవసాయ అభివృద్ధికి దోహదపడాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పాలెంలోని దక్షిణ తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం డైమండ్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు, నూతన వంగడాల ప్రదర్శన, వ్యవసాయ పనిముట్లు తదితర స్టాల్స్‌ను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. పరిశోధన కేంద్రం పరిధిలో మూడు ఏరువాక కేంద్రాలు, ఐదు కేవీకేలు ఉన్నాయని ఏడీఆర్ డాక్టర్ వెంకటయ్య వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తల ఆవిష్కరణలను ఈ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకొని సాగులో అధిక లాభాలను అర్జించి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. అనంతరం ఉత్తమ రైతులకు, సిబ్బందికి ప్రోత్సాహకాలను అందజేశారు. పాలెం ఆర్ఏఆర్ఎస్ పూర్వపు ఏడీఆర్‌లు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటరమణ, టీవీకే సింగ్, పీజేటీఏయూ బోర్డు మెంబర్ సురేందర్, కేవీకే కోఆర్డినేటర్లు ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, ఏరువాక కోఆర్డినేటర్లు భరత్ భూషణ్, సహెద్, అనిల్, పాలెం ఏటీపీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి, సుధాకర్, డాక్టర్ పద్మజ, డాక్టర్ రామాంజనేయులు, ఆయా విభాగాల శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర, వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు, రైతులు ఉన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు విజయవంతం

- రాష్ట్ర స్థాయికి ఎంపికైన 26 ప్రదర్శనలు
- ఉత్తమ ప్రదర్శనలకు ప్రశంసా పత్రాలు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విజయవంతంగా ముగి శాయని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ ప్రదర్శనల విద్యార్థులకు శుక్రవారం జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల నుంచి 512 ప్రదర్శనలు ఏర్పాటు చేయగా అందులో 26 ప్రదర్శనలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ విద్యా కేంద్రంలో బుధ, గురు, శుక్రవారాల్లో మూడు రోజులు పాటు నిర్వహించిన ప్రదర్శనలను దాదాపు వెయ్యి మంది విద్యార్థులు సందర్శించి తిలకించారని తెలిపారు. ఈ నెల చివరి వారంలో రాష్ట్ర పోటీల్లో జిల్లా నుంచి ఎంపికైన 26 ప్రదర్శనలతో విద్యార్థులు పాల్గొంటారన్నారు. జూనియర్ విభాగంలో 7, సీనియన్ విభాగంలో 7, ఒక్కో సెమినార్, టీచింగ్ లెర్నిగ్ మెటీరియల్ ఒకటితో పాటు 10 ఇన్‌స్పైర్ మానక్ అవార్డు కలిపి మొత్తం 26 ప్రదర్శనలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, ఏసీ రాజశేఖర్‌రావు, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం

- ● పాలమూరులో ఒక్కో వార్డుకు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల కేటాయింపు
- ● పార్టీలకు అతీతంగా నిధులు ఇవ్వడంతో సభ్యుల హర్షం
- ● కౌన్సిల్ గడువు ముగుస్తున్నందున పనులు త్వరగా చేయించాలని విన్నపం



హాజరైన సభ్యులు, మాట్లాడుతున్న బీజేపీ సభ్యుడు అంజయ్య

మహబూబ్‌నగర్, డిసెంబరు 13: మహబూబ్‌నగర్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నడూ లేని విధంగా రూ.40 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఒక్కో వార్డుకు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షలతో పాటు మరికొన్ని వార్డులకు అంతకన్నా ఎక్కువ నిధులు కేటాయించారు. ఒకే సారి తమ వార్డులకు అధిక మొత్తంలో నిధులు కేటాయించడంతో అధికార పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల సభ్యులు పార్టీలకు అతీతంగా చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌పై ప్రశంసలు కురిపించారు. త్వరగా టెండర్లు నిర్వహించి, ప్రస్తుత కౌన్సిల్ గడువు ముగిసేలోపు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులంతా ముక్తకంఠంతో సభను కోరారు. అన్ని వార్డులకు కేటాయించిన రూ.40 కోట్ల నిధులకు కౌన్సిల్ ఆమోదం చెప్పింది.

నిధులు తిరిగివ్వాలనడం సరికాదు

బీజేపీ ఫ్లోర్ లీడర్ అచ్చుగట్ల అంజయ్య మాట్లాడుతూ గతానికి భిన్నంగా అన్ని వార్డులకు అధికంగా నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో రూ.3.50 కోట్లను గ్రీనరీ కోసం హరితహారం నిధులు ఖర్చు చేశారన్నారు. అప్పుడు ముడా నుంచి నిధులు ఇప్పించగా, ఇప్పుడు ఇచ్చిన నిధులు తిరిగివ్వాలని ముడా లెటర్ రాయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పురపాలికలో నిధులు లేనప్పుడు ముడాకు అన్ని నిధులు ఎలా ఇస్తారని, అసలు గతంలో చేపట్టిన ఆ పనులు ఎక్కడెక్కడ చేపట్టారో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మునిసిపాలిటీ ముందు స్ట్రీట్‌వెండర్ దుకాణాలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. లేదంటే అక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. అలాగే రాజీవ్ చౌరస్తాలో తిలక్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని, పక్కనే మరో వర్గానికి చెందిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరడం సరికాదన్నారు. దీనిపై పలువురు సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్మన్ జోక్యం చేసుకుని సభను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని, ఈ విషయాన్ని సభలో కాకుండా తరువాత చర్చిద్దామని సభ్యులకు సర్దిచెప్పారు.

రూ.10 లక్షలకే ఎదురు చూడాల్సి వచ్చేది

కట్టా రవికిషన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇదివరకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకే ఎదురుచూడాల్సి వచ్చేదని, ఇప్పుడు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఎంఐఎం సభ్యులు సాజిద్ మాట్లాడుతూ నాలుగేళ్లలో కేటాయించని నిధులు ఏడాది కాలంలోనే కేటాయించారని చైర్మన్‌పై ప్రశంసలు కురిపించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ రావుల అనంతరెడ్డి మాట్లాడుతూ ఏడాదిగా తన వార్డులో ఒక్కపని కూడా జరగలేదన్నారు. హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవం శిలాఫలకంపై ప్రోటోకాల్ పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కో ఆప్షన్ అసద్ అడ్డుతగిలారు. నాలుగేళ్లు ఏం పనులు చేశారో కూడా చెప్పాలని కోరడంతో ఇద్దరి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్మన్ ఆనంద్ స్పందిస్తూ కావాలని అనంతరెడ్డి పార్టీ ఆదేశాల మేరకు మాట్లాడుతున్నారని, మనస్ఫూర్తిగా మాట్లాడటం లేదన్న విషయం తెలుస్తుందన్నారు. ఇకనుంచి ఆ వార్డులో జరిగే పనులన్నీ దగ్గరుండి చేయిస్తానని స్పష్టం చేశారు. కౌన్సిలర్లు రమాదేవి, రశ్మిత, స్వప్న మాట్లాడుతూ నాలుగేళ్లుగా వార్డులలో ఎలాంటి పనులు చేయలేదని, ఇప్పుడు నిధులు కేటాయించడంతో వార్డుల్లో ధైర్యంగా తిరిగే పరిస్థితి ఉందన్నారు.

గోవింద్ ఆవేదన.. ఆనంద్ భరోసా

అధికార పార్టీ సభ్యులు గోవింద్ మాట్లాడుతూ తన వార్డులో ఎలాంటి పనులు చేపట్టడంలేదని, నిధులు కేటాయించినా పనులు జరగడం లేదని వాపోయారు. ఇదివరకున్న చైర్మన్ పనులు చేయలేదని, చైర్మన్‌ను మార్చిన తరువాత కూడా అదే పరిస్థితి ఉందన్నారు. పనులు జరగాలంటే కాళ్ళు మొక్కాలా? అని ప్రశ్నించారు. సభ్యులంతా సంతోషంగా ఉన్నారని, తాను మాత్రం లేనని అన్నారు. దీనికి చైర్మన్ ఆనంద్ గౌడ్ బదులిస్తూ కొంతకాలంగా గోవింద్ ఆరోగ్యం బాగలేదని, తానే ఆయనకు ఫోన్ చేసి వార్డులో ఏమేం పనులు పెట్టాలో అడిగి పెట్టడం జరిగిందన్నారు. అధికారులు, కౌన్సిలర్లు అందరం కలిసి గోవింద్ వార్డులో పనులు చేయించేందుకు బాధ్యత తీసుకుందామని చెప్పారు. వెంటనే టెండర్లు వేయించి పనులు చేయిస్తే మళ్లీ సభ్యులు ప్రజల వద్దకు వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించామన్నారు. వార్డులలో తిరిగినప్పుడు కాలనీ సమస్యలు చాలా చూశానని, అందుకే నిధులు కేటాయించామన్నారు. సభ్యులు వెంట పడి దగ్గరుండి పనులు చేయించుకోవాలని కోరారు. సమావేశంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

వ్యయం మూడింతలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎల్ఐ), జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలన్నింటిలోనూ ఇదే దుస్థితి ఉన్నది. రైతులకు నీరివ్వడానికి తాత్కాలిక పద్ధతులు చేపట్టిన ప్రభుత్వాలు శాశ్వతంగా స్థిరీకరణ చేయకుండా ప్రాజెక్టుల వ్యయం పెంచుతున్నాయి.

పీఆర్ఎల్ఐ అంచనా వ్యయం రెండింతలు

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామ శివారులోని కోతి గుండు సమీపంలో శ్రీశైలం తిరుగు జలాలను వినియోగించుకునేలా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐ) రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులకు 2016 జూన్‌లో రూ. 32,500 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించారు. మొత్తం ఆరు జిల్లాలు, 70 మండలాల్లోని 1226 గ్రామాలకు తాగునీరు, 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అందులో ఇప్పటివరకు రూ. 26,262 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ. 8,938 కోట్లు పాత అంచనాల ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పునఃప్రతిపాదించారు. దాని ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు రూ. 55,086 కోట్లవుతుంది. కానీ ఇప్పటికీ ఒక్క ఎకరాకు కూడా నీరందలేదు. మళ్లీ రేట్లు పెంచితే ఆ మొత్తం రూ. 80 వేల కోట్ల వరకు చేరుకుంటుందని ఇరిగేషన్ నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్‌లో రూ. 1285 కోట్లు పీఆర్ఎల్ఐకి ప్రభుత్వం కేటాయింపులు చేసింది.

నెట్టెంపాడు రెండింతలపైనే

జూరాల బ్యాక్ వాటర్ ఆధారంగా 2005లో జవహర్ నెట్టెంపాడు లిఫ్టును ప్రతిపాదించి అదే సంవత్సరం జీఓ నెంబర్ 108 ద్వారా రూ. 1428 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లోని 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలి. ఇప్పటివరకు 1.42 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ప్రధానమైన 99, 100 ప్యాకేజీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు అంచనాలు ప్రస్తుతం రూ. 2754 కోట్లుగా ఉన్నది. ఇప్పటివరకు రూ. 2503 కోట్లు ఖర్చు చేయగా ఇంకా రూ. 231.36 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ. 105 కోట్లు కేటాయించారు. అవి కూడా రివైజ్డ్ ఎస్టిమేషన్‌కే సరిపోవడం లేదు. ఇదికాక ర్యాలంపాడు లీకేజీల కారణంగా ప్రాజెక్టును నింపడం లేదు. దాన్ని మరమ్మతు చేయాలంటే మరో రూ. 150 కోట్లు అవసరమవుతాయని అంచనాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రెండేళ్లు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

కల్వకుర్తి వ్యయం మూడింతలు

కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా 2005లో చేపట్టారు. ప్రారంభంలో 25 టీఎంసీలను ఎత్తిపోయడం ద్వారా 3.65 లక్షల ఎకరాలకు నీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకొని రూ. 2100 కోట్లతో అంచనా వ్యయం నిర్దేశించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టును రీడిజైన్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం 25 టీఎంసీలను 40 టీఎంసీలకు పెంచింది. ప్రాజెక్టు ఆయకట్టును కూడా 4.50 లక్షలకు పెంచింది. ప్రస్తుతం ప్రాజెక్టు అంచనా మూడింతలు పెరిగి రూ. 5860 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఉన్న డిజైన్ ప్రకారమే పూర్తి ఆయకట్టుకు నీరందించాలంటే మరో రూ. 377 కోట్లు అవుతుందని ప్రస్తుత ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటికే నిల్వ సామర్థ్యం సరిగా లేదు. 51 ఆన్‌లైన్ రిజర్వాయర్లు నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. వాటిని కలుపుకుంటే ఆ వ్యయం పదింతలు పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో పథకానికి రూ. 715 కోట్లు కేటాయించారు.

మిగతా ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇంతే...

రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకాన్ని రెండు దశలుగా చేపట్టారు. భీమా 1 ద్వారా 1.11 లక్షల ఎకరాలు, భీమా-2 ద్వారా 2.03 లక్షల ఎకరాలు సాగు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు ప్రారంభ అంచనా రూ. 2158 కోట్లు కాగా ఇప్పటికీ రెండింతలు పెరిగింది. ఇంకా రెండు దశల్లో కలిపి లక్ష ఎకరాలకు నీరందనే లేదు. దీని పూర్తికి దాదాపు మరో రూ. 350 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో భీమాకు కేవలం రూ. 32 కోట్లు కేటాయించారు. కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా 50 వేల ఎకరాలకు నీరందించాలి. కానీ, ఇప్పటివరకు ఆ స్థాయిలో నీరందడం లేదు. రూ. 460 కోట్లు ఖర్చు చేశారు. పూర్తి చేయడానికి మరో రూ. 100 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. కొత్త ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. వాటినీ పరిగణనలోకి తీసుకుంటే వ్యయం పెరుగుతోంది. ఈ బడ్జెట్‌లో రివైజ్డ్ ఎస్టిమేషన్ కోసమే రూ. 429 కోట్లు కేటాయించారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రూ. 900 కోట్లతో చేపట్టగా ప్రస్తుత అంచనా రూ. 1197.70 కోట్లకు చేరింది. ఇందులో రూ. 629.26 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ. 558.34 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అసలు కీలకమైన వల్లూరు, జూలకల్, మల్లంపల్లి రిజర్వాయర్ల ఊసే లేదు. ప్రస్తుత రేట్లను పరిగణనలోకి తీసుకుంటే రూ. 1500 కోట్లు దాటే అవకాశం ఉంది. గట్టు ఎత్తిపోతల పథకానికి రూ. 581 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు రూ. 204.96 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ. 362 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.


ప్రాజెక్టులపై పాలకులకు పట్టింపులేదు



ప్రాజెక్టులపై పాలకులకు పట్టింపు లేదు. నిర్ణయించిన కాలపరిమితి మేర నిర్మాణం చేపట్టకపోవడంతో అంచనా వ్యయం అంతకంతకూ పెరిగిపోతోంది. 40 ఏళ్లగా ఆర్డీఎస్ పూర్తి చేయకపోవడం బాధాకరం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై పాలకులకు పట్టింపులేదు. కాళేశ్వరం పూర్తి చేసినా, అప్పటి ప్రభుత్వం పాలమూరును విస్మరించింది. ఆ నిధులు ఇక్కడ పెట్టి ఉంటే పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవి. కాంగ్రెస్ వచ్చి ఏడాదైనా ప్రాజెక్టుల పనులేమీ చేయలేదు. పాలకులు కాంట్రాక్టర్ల కమీషన్లకోసం అంచనాలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- రాఘవాచారి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్

ఆలస్యంతో వ్యయం పెరుగుతోంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయించే నిధులు విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయి. నిధుల విడుదలలో ఆలస్యం చేయడంతో ప్రాజెక్టు నిర్మాణ ధరలు పెరుగుతున్నాయి. దాంతో వ్యయం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, పెండింగ్ ప్రాజెక్టుల పనులు వేగవంతంగా చేయాలి. పనులు ప్రణాళికబద్ధంగా చేసి, రైతాంగాన్ని ఆదుకోవాలి.

- జబ్బార్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

పాహిమాం.. పబ్బతి హనుమా

పదర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాహిమాం పబ్బతి హనుమా అంటూ భక్తజనులు, మాలధారణ స్వాములు ఇరుముడితో నల్లమలలోని పబ్బతి ఆంజనేయ స్వామి సన్నిధికి చేరుతున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజైన శుక్రవారం ఆలయంలో ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రీ, వేద పండితులు శివార్చకం శివప్రసాద్ వర్మ, రఘు శర్మల ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వర, గవ్యాంతర పూజలు, మాలమంత్ర, మన్యూసూక్త, రుద్ర హోమములు నిర్వహించారు. తరువాయి నితోపాసన, బలిహరణ, మహానివేదన నీరాజనం, మంత్ర పుష్పము, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అదే విధంగా ఆలయ ఆవరణలో మంత్రోచ్చరణాల మధ్య 'హనుమాన్ వ్రతం' జరిపించారు. సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ చేసి రాత్రి మారుతి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి సంకీర్తనల మధ్య స్వామి వారికి గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం నేత్ర పర్వంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం చేశారు. ఈ సందర్భంగా రాత్రి 9గంటలకు అచ్చంపేట రంగస్థల కళాకారుల ఆధ్వర్యంలో సంపూర్ణ సీతారాముల కల్యాణం, వీర బ్రహ్మంగారి చరిత్ర, రామాంజనేయ యుద్ధం, శ్రీ కృష్ణ యుద్ధం తదితర ఘట్టాల నాటక ప్రదర్శన చేశారు. మూడో రోజు నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రాములు నాయక్, ఈవో రంగాచారి అధికారిక లాంఛనాలతో ఆహ్వానం పలికారు. శాలువా కప్పి ఆశీర్వచనాలు అందించారు.

రూ.2 కోట్ల విలువైన మాదకద్రవ్యాల దహనం

● ఉమ్మడి జిల్లాలోని ఏడాది కాలంలో పట్టివేత

● కాల్చేసిన డ్రగ్ డిస్పోజల్ కమిటీ

మహబూబ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 10 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఏడాదికాలంగా పట్టుబడిన దాదాపు రూ. 2 కోట్ల విలువగల గంజాయి, ఆల్ప్రాజోలం, డైజోఫాం, హాశీష్ ఆయిల్‌ను ఎక్సైజ్ పోలీసులు దహనం చేశారు. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్ డిస్పోజల్ కమిటీ మాదకద్రవ్యాలను కాల్చివేసింది. మొత్తం 24 కేసుల్లో పట్టుబడిన 10 కేజీల ఎండు గంజాయి, 11 గంజాయి మొక్కలు, 16 కేజీల ఆల్ప్రాజోలం, 1.5 కేజీల డైజోఫాం, 5 కిలోల హాశీష్ ఆయిల్‌ను రంగారెడ్డి జిల్లాలోని జిజె మల్టీక్లేవ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన బర్నింగ్ బాయిలర్‌లో వేసి కాల్చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్‌లు శ్రీనివాస్, నరసింహారెడ్డి, సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.



(ఇన్‌సెట్లో) సీతా అశోక పుష్పాలు (శాస్త్రీయనామం సరాక అశోక)



1, 2, 3 : పచ్చదనంతో అలరారుతున్న బొటానికల్ గార్డెన్



(ఇన్‌సెట్లో) అరుదైన పూల మొక్క హబినేరియా గిబ్సోని

'సదా'శయం ఔషధ వనం

» అరుదైన, ఔషధ మొక్కలకు నిలయం » అంతరించి పోతున్న జాతుల సంరక్షణ కేంద్రం » జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని బొటానికల్ గార్డెన్



ఆర్కిడ్ జాతి పూల మొక్క శాస్త్రీయనామం పాంక్రాషియం తెలంగానెన్సే



ఎర్రచందనం మొక్క (టీరోకార్పస్ శాంటాలైనస్)

జడ్చర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఔషధ గుణాలున్న.. అంతరించి పోతున్న.. అరుదైన మొక్కలు, చెట్లు.. అన్నీ ఒకే చోట ఉండే అద్భుతమైన నందనవనం.. గతంలో ఎక్కడా లేని రీతిలో మన రాష్ట్రం ఆకారంలో తీర్చి దిద్దిన బొటానికల్ గార్డెన్.. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉంది. వృక్షశాస్త్ర అధ్యాపకుడు ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య ఆధ్వర్యంలో ఈ తోట రూపు దిద్దుకున్నది. వృక్ష శాస్త్ర పరిశోధకులు, విద్యార్థులకు ఎంతగానో ఉపకరించే ఈ తోటను ఐదున్నర ఎకరాల్లో ఏర్పాటు చేశారు. అందులో మూడు ఎకరాలలో తెలంగాణ రాష్ట్రం ఆకృతితో మొక్కలను నాటి పెంచుతున్నారు. వాటిలో పండ్లు, పూలు, అటవీ, ఔషధ, ఎడారి, అలంకరణ, స్థానిక తదితర 650 రకాలకు చెందిన దాదాపు ఏడు వేలకుపైగా మొక్కలున్నాయి. ఈ తోటలోని వివిధ రకాల మొక్కలు, వాటి ప్రాధాన్యతలపై ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్యతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడి తెలుసుకున్నది. ఆ వివరాలు మీ కోసం..

ఔషధ మొక్కలు

ఔషధ మొక్కలలో పంచతులసి, ఇన్సులిన్ మొక్క, అడ్డరసము, అర్జునవృక్షం, కచ్చూరాలు అత్యంత ప్రాధాన్యమైనవి. రామతులసి, కృష్ణ తులసి, లక్ష్మీతులసి, గుజతులసి, సబ్జా అనే ఐదు రకాల మొక్కలను పంచతులసి అంటారు. వీటితో జలుబు, దగ్గు, విరేచనాలు, వాంతులు, చర్మ రోగాలు, అజీర్తి, వాత సంబంధ వ్యాధులు నయం అవుతాయి. టైప్-2 డయాబెటిస్ వ్యాధి నివారణకు ఇన్సులిన్ మొక్క ఔషధంగా పనిచేస్తుందని, శాస్త్రీయంగా నిరూపించబడింది. అడ్డరసము మొక్క ఆకులతో చేసిన కషాయాన్ని శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు వాడుతారు. ఇది చర్మ సంబంధిత వ్యాధులతో పాటు కామెర్లు, మలబద్దకం, మొలలకు ఔషధంగా పని చేస్తుంది. అర్జున వృక్షం బెరడు, ఆకులు గుండె జబ్బు, అధిక రక్తపోటు, ఊబకాయం, చర్మ సంబంధ రోగాలను నయం చేసేందుకు ఆయుర్వేద వైద్యులు వినియోగిస్తున్నారు. కచ్చూరాలు కడుపులో మంట, విరోచనాలు, ఎలర్జీ, ఊబకాయం, గాయాలను మాన్పుతాయి. ఈ మొక్కలు సువాసనను వెదజల్లే అల్లం లాంటి కొమ్మలను కలిగి ఉండి, రెండు లేదా మూడు ఆకులను కలిగి, అత్యంత సున్నితంగా ఉంటాయి.

అంతరించిపోతున్న మొక్కలు

అంతరించిపోతున్న మొక్కలలో గాలి బుడగ చెట్టు, సీతా అశోక, ఎర్రచందనం, అడవి గుగ్గిలం, సైకాస్ బెడ్డోమి మొక్కలు అత్యంత ప్రధానమైనవిగా చెప్పవచ్చు. గాలి బుడగ చెట్లు ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తమిళనాడులోని సేలం జిల్లాల్లో మాత్రమే ఉన్నాయి. దీనిని అంతరించి పోతున్న చెట్టుగా ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) గుర్తించింది. సీతా అశోక చెట్టు దట్టమైన అడవిలో ఐదు మీటర్ల ఎత్తు మాత్రమే పెరుగుతుంది. దీనికి కాషాయం రంగులో గుత్తులు, గుత్తులుగా పూలు పూస్తాయి. రామాయణంలో ఈ చెట్టు ప్రస్తావన ఉంటుంది. రావణ లంకలోని అశోక వనంలో ఈ చెట్టు కిందనే సీతమ్మ కూర్చుంది. అందుకే దీనిని సీతా అశోక చెట్టు అంటారని పండితులు చెప్తుంటారు.

ఎర్రచందనం మొక్కలు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాత్రమే సహజంగా పెరుగుతాయి. అడవి గుగ్గిలం మొక్క కేవలం తిరుమల కొండలలో మాత్రమే పెరుగుతుంది. ఈ మొక్క కాండం నుంచి సాంబ్రాణిని సేకరిస్తారు.

అలాగే సైకాస్ బెడ్డోమీ మొక్కలు సైతం తిరుమల కొండలు, నెల్లూరులోని పెంచలకోన అభయారణ్యంలోనే పెరుగుతాయి. ఇవి మూడు నుంచి ఐదు అడుగుల ఎత్తు మాత్రమే పెరుగుతాయి. ఈ మొక్కలు సుమారు 30 కోట్ల సంవత్సరాల క్రితం డైనోసారస్‌లతో కలిసి భూమి మీద జీవించినట్లు తెలుస్తోంది.

ఆకట్టుకునే అరుదైన మొక్కలు

అరుదైన మొక్కలలో ఒకటైన బ్రాకిస్టెల్మా అనంతగిరియెన్సే మొక్క రాష్ట్రంలోని అనంతగిరి కొండల్లో మాత్రమే పెరుగుతుంది. ఈ మొక్కను 2021లో జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సదాశివయ్య, ఉస్మానియ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్రం విభాగం డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, పరమేశ్ కనుగొన్నారు. పాంక్రాషియం తెలంగానెన్సే మొక్క రాష్ట్రంలోని నల్లమల అడవులలో మాత్రమే పెరుగుతుంది. ఈ మొక్కను కూడా 2018లో డాక్టర్ సదాశివయ్య కనుగొన్నారు. దీనికి తెలంగాణ పేరు ప్రతిబింబించేలా నామకరణం చేయడం విశేషం. హాబినేరియా గొబ్సోని మొక్కలు ఆర్కిడ్ జాతికి చెందినవి. ఇవి కూడా రాష్ట్రంలోని అనంతగిరి కొండల్లో పెరుగుతాయి. హెర్బల్ లిప్‌స్టిక్ ట్రీగా పేరుపొందిన బిక్స ఒరల్లిన మొక్కలను కూడా ఈ బొటానికల్ గార్డెన్‌లో పెంచుతున్నారు. వీటి విత్తనాల నుంచి సహజ సిద్ధమైన లిప్‌స్టిక్‌ను తయారు చేసారు. ఆండ్రోగ్రాఫిస్ నల్లమలయాన మొక్క తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని నల్లమల అడవులలో మాత్రమే ఉంటాయి. బార్లీరియా అనే ప్రజాతికి చెందిన అలంకరణ మొక్కలు డిసెంబరాలు కూడా ఇక్కడ ఉన్నాయి.



అనంతగిరి కొండల్లో మాత్రమే పెరిగే అరుదైన మొక్క బ్రాకిస్టెల్మా అనంతగిరియెన్సే



డిసెంబరు పూల మొక్క (శాస్త్రీయనామం బార్లేరియా క్రిస్టేట)



లిప్‌స్టిక్ మొక్క గింజలు (శాస్త్రీయనామం బిక్సఒరల్లిన)

స్పోర్ట్స్ బాక్స్

'సీఎం కప్'ను విజయవంతం చేయాలి

» 16 నుంచి జిల్లా స్థాయి పోటీలు : డీవైఎస్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో శ్రీనివాస్, చిత్రంలో ఎన్పీ వెంకటేశ్, కురుమూర్తి గౌడ్, జాకీర్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని మహబూబ్‌నగర్ డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల నిర్వహణపై క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులతో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కప్ పోటీలు గ్రామ, మండల స్థాయిలో ముగిశాయని తెలిపారు. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేసి విజయవంతం చేసేందుకు క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు అన్ని సంఘాల నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్, ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీలో ప్రతిభ చాటాలి

» ఎస్‌వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి



క్రీడాకారులు రాజేశ్‌నాయక్, సౌమిత్, గౌతమ్, వినయ్‌గౌడ్‌లతో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ.జోషి, వైస్ ప్రిన్సిపాల్ రోహిత్‌దీక్షిత తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి అన్నారు. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల వాలీబాల్ టోర్నీలో పాల్గొనే కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వాలీబాల్ పురుషుల జట్టుకు ఎస్‌వీఎస్ వైద్య కళాశాల విద్యార్థులు రాజేశ్‌నాయక్, సౌమిత్, గౌతమ్, వినయ్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంరెడ్డి మాట్లాడారు. సౌత్‌జోన్ పోటీలకు కళాశాలకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. పోటీల్లో రాణించి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ.జోషి, వైస్ ప్రిన్సిపాల్ రోహిత్‌దిక్షిత్, ఫిజికల్ డైరెక్టర్ ఆర్. దామోదర్‌రెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మహిమాన్వితం.. వల్లభాపురం

» నేడు దత్త జయంతి సందర్భంగా శ్రీపాదవల్లభుడికి ప్రత్యేక పూజలు



వల్లభాపురం సమీపంలోని కృష్ణానది పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మక్తల్ రూరల్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని పస్పుల సమీపంలోని వల్లభాపురం మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతోంది. దత్త జయంతి సందర్భంగా శనివారంలో ఇక్కడ ప్రత్యేక పూజలు చేయనున్నారు. దత్తాత్రేయుడి భక్తులు, తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం గ్రామానికి సుమతి, అప్పలరాజుశర్మ దంపతులకు స్వామి వరంతో కుమారుడు జన్మించగా, పాదవల్లభుడని పేరు పెట్టుకున్నారు. బాలుడు ఆరో ఏటనే వేదాలు, ఉపనిషత్తులు నేర్చుకున్నాడు. 16వ ఏట తన జన్మ వృత్తాంతాన్ని తల్లిదండ్రులకు వివరించి, గోకర్ణం, శ్రీశైలం తదితర క్షేత్రాల్లో పర్యటించారు. చివరకు వల్లభాపురం సమీపంలో కృష్ణానది మధ్యనున్న కుర్వపురం వద్ద స్థిరపడ్డారు. ఇక్కడ కొన్ని సంవత్సరాల పాటు రాత్రి వేళ నది మధ్యలోనున్న పెద్ద కొండరాయిపై తపస్సు చేసేవాడు. అలా తపస్సు చేస్తూ అక్కడే అంతర్ధానమయ్యారని స్థానికులు చెప్తుంటారు. ఆయన తపస్సు చేసిన ప్రాంతంలోనే భక్తులు ఆలయం నిర్మించారు. గర్భాలయంలో శ్రీపాద వల్లభుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పుట్టిలో నదిని దాటి వస్తుంటారు. ఇక్కడి మేడిచెట్టు వద్ద వెలసిన పాతాళ వినయకుడికి భక్తులు పూజలు చేస్తారు. శ్రీపాద శ్రీవల్లభుడితో పాటు నరసింహ సరస్వతీ స్వామి (మహరాష్ట్ర) మాణిక్య ప్రభు మహరాజ్ (గుల్బర్గా), అక్కల్‌కోట మహరాజ్(అక్కల్) షిరిడీ సాయి దత్తాత్రేయుడి అవతారాలని చెబుతారు. దత్త జయంతి సందర్భంగా 14న ఉదయం నాలుగు గంటలకు మహా మంగళ హారతి, ఏడు గంటలకు రుద్రాభిషేకం, ఉయ్యాల పూజ, దత్తహోమం, మాల విరమణ కార్యక్రమాలుంటాయి. 15న అభిషేకం, పూజలు, ఉయ్యాల సేవ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వల్లభాపురానికి చేరుకోవాలి ఇలా..

హైదరాబాద్ నుంచి రాయిచూరు వెళ్లే మార్గంలో మక్తల్ పట్టణం నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది. ముందుగా మక్తల్‌కు చేరుకొని, అక్కడి నుంచి ప్రత్యేక బస్సులు, ఆటోలో వల్లభాపురం చేరుకోవచ్చు. హైదరాబాద్ నుంచి మక్తల్‌కు దాదాపు 165 కిలోమీటర్లు కాగా, మక్తల్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో వల్లభాపురం ఉంటుంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తెలకపల్లి/ అయిజ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. హైదరాబాద్‌లోని బడంగ్‌పేటలో ఉంటున్న ముగ్గురు స్నేహితులు చింతకుంట్ల ఆంజనేయులు, క్యాసనపల్లి ప్రభుదేవా, అఖిల్ గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని గోలగుండం గ్రామానికి బయలు దేరారు. కమ్మారెడ్డిపల్లి మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. దీంతో వాహనం నడుపుతున్న ప్రభుదేవా (18) అక్కడికక్కడే మృతి చెందాడు. గోల గుండం గ్రామానికి చెందిన ఆంజనేయులు, అఖిల్ గాయపడ్డారు. మృతుడి తండ్రి చిన్న గురువయ్య శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలకపల్లి ఎస్ఐ బీ.నరేష్ తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజకు చెందిన విద్యుత్ సంస్థ కాంట్రాక్ట్ ఉద్యోగి కిష్టన్న (49) శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఆఫీస్‌కు బయలుదేరాడు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో, పక్క నుంచి వెళ్తున్న బస్సుకు తగిలి కింద పడ్డాడు. ఆయన కాలిమీద నుంచి బస్సు వెనుక చక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెదాడు. మల్దకల్ మండలం, అమరవాయి గ్రామానికి చెందిన కృష్ణ 25 ఏళ్లుగా అయిజలోని విద్యుత్ కార్యాలయంలో కాంటాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.



నారాయణపేటలో ధ్వంసమైన ఏటీఎం

కేబీఎస్ ఏటీఎంలో చోరీకి యత్నం

» యంత్రాన్ని ధ్వంసం చేసిన దుండగుడు » సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి పట్టివేత

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం ముం దున్న కృష్ణా, భీమా గ్రామీణ బ్యాంకు (కేబీఎస్) ఏటీఎంను ఓ దుండగుడు ధ్వంసం చేసి, చోరీకి యత్నించారు. కానీ డబ్బు తీసుకోవడం సాధ్యం కాక వెళ్లిపోయాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరి గింది. ప్రధాన రహదారి కావడం, జన, వాహన సంచారం ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఉండే ఏటీఎంను ధ్వం సం చేయడం చర్చనీయాంశం అయ్యింది. సంఘటనపై బ్యాంకు మేనేజర్ బాల వెంకటన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణను ప్రారంభించిన పోలీసులు ఆ ప్రాంతంలోని పలు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, నిందితుడిని గుర్తించారు. పట్టణంలోని కురువగేరికి చెందిన తోళ్ల మల్లేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరాన్ని అంగీకరించారు. అతడి నుంచి ఏటీఎంను ధ్వంసం చేసేందుకు వినియోగించిన కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తానికి చోరీ కేసును పోలీసులు రెండు గంటల్లో ఛేదిం చారు. ఈ విషయంపై ఎస్ఐలు వెంకటేశ్వర్లు, కృష్ణదేవ్ రాము, అంజనేయులు, లింగమూర్తిలను సీఐ శివశంకర్ అభినందించారు.

పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

» భక్తి శ్రద్ధలతో ధ్వజారోహణ » నేడు ప్రభోత్సవం

మక్తల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్‌లో పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఉదయం అర్చకులు ధ్వజారోహణం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అంతకు ముందు పట్టణంలోని ఉత్తరాది మఠం నుంచి ఆలయం ఊరేగింపు నిర్వహించారు. వారం రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని ధర్మకర్త ప్రాణేషాచారీ, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌చారీ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు అరవింద్, మాన్వి రామారావు, వాదిరాజ్, భక్తులు చంద్రకాంత్‌గౌడ్, బాల్చెడ్ మల్లికార్జున్, లక్ష్మారెడ్డి, కట్టా సురేష్‌కుమార్‌గుప్తా, భీంరెడ్డి తదితరులు పాల్గొ న్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పది గంటలకు పవమాన హోమం, సాయంత్రం ఆరు గంటలకు నెమలివాహనసేవ, 6.30 గంటలకు ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ప్రాణేషాచారీ, అర్చకులు అరవింద్ తెలిపారు.



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చెరువులు నింపేందుకు కృషి

● ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్



కోస్గి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోస్గి మండలంలోని అన్ని కుంటలు, చెరువులు నింపి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్ తెలిపారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

మండలంలోని కుంటలు, చెరువులు నింపేందుకు ప్రణాళికలు చేశారా?

చెరువులు నింపేందుకు కృషి చేస్తున్నాం. ప్రధానంగా చెరువులకు వచ్చే పాటుకాలువలు మూయడంతో చెరువులు నిండటం లేదు మొదట వాటిని తీయిస్తున్నాం.

మునిసిపాలిటీలో ఏమైనా కాలువలు మూస్తే చర్యలు తీసుకుంటున్నారా?

మునిసిపల్ అధికారులతో కలిసి మా ఏఈలు సంయుక్తంగా తనిఖీ చేస్తున్నారు. కాలువలు మూసి నిర్మాణాలు చేస్తే అనుమతులు రద్దు చేయాలని మునిసిపల్ అధికారులకు లేఖలు రాసున్నాం.

ఇప్పటివరకు ఏమైనా భవనాలు అలా గుర్తించారా?

సుమారు పది వరకు గుర్తించాం. ఏఈ నిర్మల టీపీవో, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వారు కూడా పరిశీలించారు. చర్యలు తీసుకుంటారో, లేదో చూడాలి.

న్యూస్ బాక్స్

ఈనెల 16న ప్రజావాణి రద్దు

నారాయణపేట టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో ఈనెల 16న కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణిని రద్దు చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఫిర్యాదుదారులు కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

నేటి నుంచి రాజమూర్ ఆంజనేయస్వామి ఉత్సవాలు

మక్తల్‌రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో వెలిసిన రాజమూర్ ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు అర్చకుడు శ్యాంసుందర్‌జోషి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు రథోత్సవం జరగనుంది. అదేరోజు సాయంత్రం పాల ఉట్లు ఉంటాయని వారు పేర్కొన్నారు.

ప్రారంభమైన గురుచరిత్ర పారాయణం

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయస్వామి జయంత్యుత్సవాల్లో భాగంగా యానగుంది మాణిక్యగిరికొండ కింద దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆలయ ట్రస్టు కార్యదర్శి కృష్ణకోర్వార్ ఆధ్వర్యంలో గురుచరిత్ర పారాయణం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మాణికేశ్వరి మాతా పాదుక పూజ నిర్వహించారు. రెండురోజుల పాటు ఉత్సవాలు, గురుచరిత్ర పారాయణం కొనసాగనుందని కృష్ణకోర్వార్ తెలిపారు.

సీపీఎస్‌కు జిరాక్స్ మిషన్ వితరణ

దామరగిద్ద, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలకు నారాయణపేటకు చెందిన దాత రూ.20వేల విలువ గల జిరాక్స్ మిషన్‌ను వితరణ చేశారు. హెచ్‌ఎం చందుజమన్, ఉపాధ్యాయులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

ధన్వాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బూత్ కమిటీ అధ్యక్షులు రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటే విధంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ మల్లయ్య అన్నారు. ధన్వాడ మండలం గున్ముక్ల, మంత్రోన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. మంత్రోన్‌పల్లి బూత్ కమిటీ అధ్యక్షునిగా శ్రీకాంత్, గున్ముక్ల బూత్ కమిటీ అధ్యక్షునిగా తిరుపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, హన్మిరెడ్డి, రవికుమార్, రాములు, వంశీప్రసాద్ పాల్గొన్నారు.

ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ విడుదల

ధన్వాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తపస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న చలో ఇందిరాపార్కు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తపస్ జిల్లా కోశాధికారి కనకప్ప అన్నారు. శుక్రవారం ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్మాగ్రహ దీక్ష పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు సికిందర్, అశోక్, నరసింహాచారి, వెంకటమ్మ, రేఖ, హరిదా సుల్తాన, నర్మద, శ్రీలత, శ్రీను, జగదీష్ తదితరులున్నారు.

రేపు అఖిల భారత యాదవ మహాసభ

దామరగిద్ద, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈనెల 15న అఖిల భారత యాదవ మహాసభ నిర్వహించనున్నామని మహాసభ నాయకులు పిడుగు శ్రీనివాస్‌యాదవ్, పిడుగు నారాయణయాదవ్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మహాసభ జాతీయ కార్యదర్శి రమేష్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య, కౌన్సిల్ సభ్యులు రఘువీర్‌యాదవ్‌లు హాజరవుతారని, వీరి సమక్షంలో మహాసభ అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని గ్రామాల యాదవులు హాజరు కావాలని కోరారు.

నిండనున్న దండం చెరువు

» ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారుల ముందడుగు

» దోమవాగు నుంచి ఎనిమిది కిలోమీటర్ల మేర కాలువ పూడిక తీతకు అంచనాలు



దండం చెరువు

కోస్గి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈజీపూర్ గ్రామ శివారులోనున్న దండం చెరువు నింపడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఈ చెరువు నిండితే కోస్గి మునిసిపాలిటీలోని సుమారు 800 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. దీంతో పాటు తొగాపూర్, సర్జాఖాన్‌పేట గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. దండం చెరువు అలుగు పారితే తొమ్మిది గొలుసుకట్టు చెరువులు నిండుతాయి. నాచారం శివారులోని కోమటిచెరువు, వైకుంఠంకుంట, కోస్గి శివారులోని దేవునిచెరువు, ఉప్పుసముద్రం, పటేల్‌చెరువు, నాగులచెరువు, బంధంచెరువు, పరంచెరువు, కడంపల్లి శివారులోని ఊరచెరువులన్నింటి కింద సుమారు 700 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. దండం చెరువు నిండాలంటే వికారాబాద్ జిల్లా దోమ మండల శివారులోని వాగు నీటిని పోలేపల్లి చెరువు మీదుగా ఇక్కడికి మళ్లించాలి. అయితే ఈ కాలువ ప్రస్తుతం పూర్తిగా పూడుకుపోవడంతో పాటు కాలువ నీరు రావడంలేదని దీంతో దండంచెరువు నిండటం లేదని అధికారులు గుర్తించారు. ఆరు నెలల క్రితం ఇరిగేషన్ ఏఈ భానుచందర్ దండంచెరువు నుంచి వెనకనున్న దోమ వరకు పాటుకాలువ వెంట తిరిగి ఎనిమిది కిలోమీటర్ల కాలువను గుర్తించారు. సుమారు ఐదు మీటర్ల వెడల్పుతో ఈ కాలువ ఉందని తెలిపారు. కాలువ పూడికతీతకు డీఈ ఆనంద్‌కిశోర్ ప్రణాళిక తయారుచేశారు. త్వరలో కొడంగల్ అభివృద్ధి అథారిటీ(కాడా) ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని.. నిధులు మంజూరు కాగానే కాలువ పూడికతీత తీస్తామన్నారు. కాలువ మధ్యలో ఒకట్రెండు చోట్ల కల్వర్టులు కట్టి నీటిని దండం చెరువులోకి నింపుతామన్నారు. ఈ చెరువు నింపితే కోస్గి రైతుల ఆనందానికి అవధులు ఉండవు. రైతులు సంతోషంగా పంటలు పండించుకుంటారు.

చెరువు అలుగు పారడం మేము చూడలేదు..



గత 30 ఏళ్లుగా దండం చెరువు అలుగు పారడం నేను చూడలేదు. ఎప్పుడో 35 సంవత్సరాల క్రితం అలుగు పారిందని మా తాత చెప్పేవాడు. ఎప్పుడు అలుగు పారుతదో చూద్దామని ఎదురుచూస్తున్న. ఆ కళ సాకారమవుతుందో, లేదో.

- అశోక్, రైతు, కోస్గి

చెరువు నిండితే పంటలు పుష్కలంగా పండుతాయి..



దండం చెరువు నిండితేనే మా భూములకు నీళ్లు వస్తాయి. పంటలు బాగా పండుతాయి. ఈసారి వర్షాకాలంలో కూడా దండం చెరువు నిండలేదు. అధికారులు దోమ వాగు కాలువ కట్టి నీరు తెస్తే బాగుంటది. చెరువు నిండితే పంటలు సస్యశ్యామలంగా పండుతాయి.

- వెంకటయ్య, రైతు, కోస్గి

చదువుతో పాటు క్రీడలూ అవసరమే

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్

» పాఠశాలల్లో సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం



ఊట్కూర్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి



కోస్గిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు, అధికారులు

కోస్గి/మరికల్/ఊట్కూర్/ధన్వాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలూ అవసరమేనని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. కోస్గి పట్టణంలోని కళాశాల మైదానంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీధర్, సీఐ దస్రూనాయక్, మునిసిపల్ అధ్యక్షుడు బెజ్జురాములు, నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా, మరికల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొండన్న, ఎంఈవో మనోరంజని, ఎస్సై రాములు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, హెచ్‌ఎం నాగరత్న, సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, రవికిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఊట్కూర్ మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ రవి, ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యప్రకాష్‌రెడ్డిలు ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీనరసింహారాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్వర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్ రెడ్డి, నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు.

ధన్వాడ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవరెడ్డి, ఎంపీడీవో సాయిప్రకాష్, తహసీల్దార్ సింధూజ, ఎంఈవో గాయత్రి బహుమతులు ప్రదానం చేశారు. బాలుర పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నరసింహాచారి, రామకృష్ణ, శ్రీనివాస్‌సాగర్, కెంచె బాల్‌రాజు, పీఈటీలు అనంతసేన, రాంమోహన్ గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్‌పీల అక్రమ అరెస్టులు తగవు

» ఆర్‌పీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఆర్‌పీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్యలక్ష్మి

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం నేడు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న రిసోర్స్‌పర్సన్లు (ఆర్‌పీలు)ను అక్రమంగా అరెస్టు చేయడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం, ఆర్‌పీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్యలక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మునిసిపాలిటీల్లో పని చేస్తున్న రిసోర్స్‌పర్సన్లు ఇంటింటికి చేరవేస్తున్నారని, మరుగుదొడ్లు కట్టుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. కనీస వేతనం ఇవ్వడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించి ప్రతీ ఆర్‌పీకి రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం, హెల్త్‌కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుజాత, లక్ష్మి, రఘుబాయి, గౌసియా, లింగమ్మ తదితరులున్నారు.

సామిల్ జిల్లా అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సామిల్ జిల్లా అసోసియేషన్ సభ్యులు

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా సామిల్ అండ్ టింబర్ డిపో అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక సత్యనారాయణ దేవాలయంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మద్దూర్‌కు చెందిన రవికుమార్‌గౌడ్, కార్యదర్శిగా మద్దూర్‌కు చెందిన శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడిగా మరికల్‌కు చెందిన తిరుపతయ్యచారి, కోశాధికారిగా నారాయణపేటకు చెందిన నందుపటేల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బ్రహ్మయ్యచారి, నగేష్‌చారి, మల్లికార్జున్, బహ్మయ్యచారి, విజయ ముదిరాజ్, ఎండీ.పాషా ఎన్నికయ్యారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

మాగనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి రాజేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మాగనూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా రాఘవేంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా నాగేష్, ఉపాధ్యక్షులుగా మౌనిక, దుబ్బన్న, కోశాధికారిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా జమ్మన్న, రామకృష్ణఆచారి, అనిత, విజయలక్ష్మి, శంకర్, గోపాల్, హుస్సేన్‌సాబ్, నర్సింలు, సోషల్ మీడియా కన్వీనర్‌గా రవికుమార్, ఆడిట్ కన్వీనర్‌గా శంకర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వేణుగోపాల్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేటలో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం ఎర్ర కందులు 1894.91 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ట ధర రూ.11,511, కనిష్ట ధర రూ.5 వేలు, రమారమి ధర రూ.10,536 పలికింది. తెల్ల కందులు 622.79 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్టం రూ.11,555 కనిష్టం రూ.9922 పలికింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి రెండురోజుల జైలుశిక్ష

దామరగిద్ద, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన నర్సాపూర్ గ్రామ వాసి జినిగే వెంకటేష్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై పి.రాజు తెలిపారు. వెంకటేష్ ఈనెల 11న మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని శుక్రవారం కోస్గి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

రేపు న్యాయవాదుల సమావేశం

మక్తల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు న్యాయవాదుల సమావేశం నిర్వహించనున్నామని మక్తల్ కోర్టు సాధన కమిటీ కన్వీనర్ దత్తాత్రేయ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మక్తల్‌కు కోర్టు మంజూరైన సందర్భంగా న్యాయవాదుల సభ్యుల అంచనా, సభ్యత్వం అంశాలు, నూతన కమిటీ తదితర అంశాలపై చర్చ, తీర్మానం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే మక్తల్ బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం నమోదు చేసుకునేవారు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం

కోస్గి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తిపాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలోని ఇంటింటికి తిరిగి సర్వే జరిగే విధానాన్ని గ్రామస్థులకు వివరించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, ముశ్రీఫా మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ముక్తిపాడ్ మాజీ సర్పంచ్ రుక్మప్ప, నాయకులు నాగులపల్లి నరేందర్, మల్లేశం తదితరులున్నారు.

మార్కెట్‌యార్డులో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి

మక్తల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మక్తల్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చంద్రశేఖర్‌కు బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కావలి వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో యార్డు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోందని, యార్డులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ నిర్మాణాలు ఆపకపోతే బీకేఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బీకేఎస్ మండల అధ్యక్షుడు కర్ని శ్రీనివాసులు ఉన్నారు.

ఆల్ఫాజోలం పట్టివేత

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చందాపూర్ గ్రామ శివారులో 462 గ్రాముల ఆల్ఫాజోలంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. చందాపూర్ గ్రామ శివారులో విక్రయాలు జరుపుతున్న 462 గ్రాముల ఆల్ఫాజోలంను స్వాధీనం చేసుకొని దోమ సత్యం, ఉషప్పగౌడ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. దాడుల్లో నారాయణపేట సీఐ అశోక్‌కుమార్, ఎస్సై రాజేందర్, సిబ్బంది కృష్ణయ్య, రియాజ్, మహేష్ తదితరులున్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఉద్యమంలో నేనే ముందుంటా..

» మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మక్తల్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఉద్యమంలో నేనే ముందుంటానని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అన్ని ఆర్థిక వనరులు ఉన్న మక్తల్ నియోజకవర్గ కేంద్రం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అనుకూలమైందని, రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పనిచేసి సాధించుకుందామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, బోయ రవి, సూరయ్యగౌడ్, కట్ట సురేష్‌కుమార్‌గుప్తా, బీఆర్‌ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, చిన్న హన్మంతు, రాజేష్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, జుబేర్, నాయుడు, బీజేపీ నాయకులు బలరాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, సీపీఐఎంఎల్ నాయకులు కృష్ణ, సలీం, కిరణ్, గోవిందరాజు, పుంజనూరు ఆంజనేయులు, బీఎస్పీ నాయకులు సురేష్, నర్సింహా, టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రఘుప్రసన్నభట్, అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నగేష్, టీఎన్‌జీవోస్ నాయకులు మున్వర్‌అలీ, సూర్యప్రకాష్, పీడీఎస్‌యూ నాయకులు భాస్కర్, ఏజీ బుట్టో, పోలప్ప, వెంకటేష్‌రాజు తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

» కలెక్టర్ సిక్తాపట్నాయక్

» గుండుమాల్‌లో పాఠశాలల తనిఖీ



గుండుమాల్‌లోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్, ఎంపీడీవో

కోస్గి/కోస్గిరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసిన ఆమె మధ్యాహ్న భోజనం వండుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులుగా గుడ్డు పెట్టడం లేదని విద్యార్థులు చెప్పడంతో కలెక్టర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత పాఠశాల తరగతి గదులు సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. తహసీల్దార్ భాస్కరస్వామి, ఎంపీడీవో శ్రీధర్, జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమ, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కట్టుదిట్టం

» ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15, 16 తేదీల్లో జరిగే టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రతను కట్టుదిట్టం చేశామని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండొద్దన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దన్నారు. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్‌లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు.

పేటలో 13 కేంద్రాలు.. 3,994 మంది అభ్యర్థులు

గ్రూప్-2 పరీక్షల కోసం నారాయణపేట జిల్లా కేంద్రంలో 13 కేంద్రాలు ఏర్పాటుచేశారు. పరీక్షలకు 3,994 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పట్టణంలోని కాకతీయ స్కూల్ కేంద్రంలో 360 మంది, శ్రీసాయి జూనియర్ కాలేజీలో 288, ద్వారకా సెంట్రల్ స్కూల్‌లో 240, వేద సరస్వతీ జూనియర్ కాలేజీలో 200, స్ఫూర్తి డిగ్రీ కాలేజీలో 312, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌లో 312, శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 222, చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 701, కృష్ణ గోకులం స్కూల్‌లో 192, లిటిల్ స్టార్ హైస్కూల్‌లో 312, పేట యాద్గీర్ రోడ్‌లోని గురుకుల పాఠశాలలో 351, బాలికల ఉన్నత పాఠశాలలో 192, రవితేజ హైస్కూల్‌లో 312 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

నెలాఖరులోపు సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలి

- బీజేపీ జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి



పేటలో రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న నందునామాజీ

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థాగత ఎన్నికలు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణపేట బీజేపీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈనెల 19 లోగా పార్టీ మండల, పట్టణ కమిటీలు పూర్తి చేయాలన్నారు. అలాగే ఈనెల చివరివారంలో జిల్లా కమిటీ ఎన్నిక పూర్తి కావాలన్నారు. రానున్న స్థానిక సంస్థాగత ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రతంగ్‌పాండురెడ్డి, గోవర్దన్‌గౌడ్, బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, సిద్ది వెంకట్రాములు, రఘువీర్ యాదవ్, నందు నామాజీ, లక్ష్మీశ్యాంసుదర్, రాము, పాండు, రమేష్ తదితరులున్నారు.

రెండో రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నారాయణపేట టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా మునిసిపల్ పార్కు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఉద్యోగభద్రత కల్పిస్తామని చెప్పి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కాగా, ఉద్యోగుల సమ్మెకు పీఆర్టీయూ, తపస్ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, నర్సింహ, వెంకట్‌రెడ్డి, రఘువీర్‌తో పాటు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమద్ వ్రతం

- భక్తజన సందోహం మధ్య మహా రథోత్సవం



మహా రథోత్సవంలో స్వామిజీ

నారాయణపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట అనంతసేన దేవాలయంలో శుక్రవారం వాదిరాజ మఠం పీఠాధిపతులు విశ్వవల్లభతీర్థులు శ్రీరాముల సంస్థాన పూజ నిర్వహించారు. ఆలయ అనంతోత్సవాలతో భాగంగా హనుమ్మద్ వ్రతంతో పాటు భక్తజన సందోహం మధ్య మహా రథోత్సవం వైభవోపేతంగా జరిగింది. హనుమద్ వ్రతం 13వ యేట ఉద్యాపనంలో భాగంగా 13 మంది దంపతులకు ఆలయ అర్చకుడు శ్రీపాద్, కౌన్సిలర్ మేఘనలు పాదపూజ చేసి వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో అనంతసేన ఆలయ భక్తబృందం, లక్ష్మీశోభన భజన మండలి మహిళా సభ్యులు, రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు, విశ్వమధ్వ మహాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.